నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 24 ఆగస్టు 2024 | ADILABAD NIRMAL

లాఠీ వదిలి..బ్యాట్ పట్టి..

నిర్మల్ అర్బన్, ఆగస్టు 23 : ఆమె ఓ జిల్లా పోలీస్ బాస్..ఎప్పుడూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో తలమునకలయ్యే అధికారి సరదాగా కాసేపు లాఠీ వదిలి క్రికెట్ బ్యాట్ పట్టారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్మల్ టైగర్స్ ట్రోఫీ 2024 క్రికెట్ పోటీలను జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం పోలీసు అధికారులు సిబ్బందితో కలిసి సరదాగా క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. మానసిక ఒత్తిడిని నివారించేందుకు క్రీడాపోటీలు దోహదం చేస్తాయన్నారు. జిల్లాలోని ఐదు పోలీస్ సర్కిల్‌లోని ఐదు టీంలు ఇందులో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అవినాష్, డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు, ఏఎస్ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందితో క్రికెట్ ఆడుతున్న నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

హనుమాన్ ఆలయానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

నేరడిగొండ, ఆగస్టు 23 : ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. నేరడిగొండ మండలంలోని ఈస్పూర్ గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యసనాలకు దూరంగా ఉండి సన్మార్గంలో పయనించాలని సూచించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జాదవ్ రమేశ్, హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయిల్ మిల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఇచ్చోడ(సిరికొండ), ఆగస్టు 23 : మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శుక్రవారం సిరికొండ మండలంలోని తిమ్మాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయిల్ మిల్‌ను ప్రారంభించారు. ముందుగా కలెక్టర్‌కు డోలు చప్పుళ్లతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలను మాజీ సర్పంచ్ అనిల్ కుమార్ వివరించారు. అనంతరం సిరికొండ మండల కేంద్రంలో సమాఖ్య సర్వసభ్య సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాలలో మరమ్మతు కాంట్రాక్టు పనులు మహిళలే నిర్వహించాలని తెలిపారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో సాయన్న, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, ఏపీఎం సంతోష్ కుమార్, హేమలత, ఎంఈవో ఉదయ్‌రావ్, కన్నాపూర్ సర్పంచ్ రఘురాం, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీపీ అమృత్ రావ్, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

రిమ్స్ ఆడిటోరియం ఆవరణలో ఎలుకలు కొరికి వేసిన మాత్రలు

పేదల మందులపై పట్టింపేది ?

ఎదులాపురం, ఆగస్ట్ 23: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆడిటోరియం ఆవరణలో లక్షల రూపాయల విలువైన మందులపై పర్యవేక్షణ కరువై ఎలుకల పాలవుతున్నాయి. సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో స్థలం లేకపోవడంతో గతేడాది నుంచి మందులు, మాత్రలు రిమ్స్ ఆడిటోరియం, డీ ఎంహెచ్‌వో కార్యాలయంలో ఉంచుతున్నారు. వాటిని ఎవరూ పట్టించుకోకపోవడంతో మందులను ఎలుకలు కొరికివేస్తున్నాయి. పేదలకు అందాల్సిన మందులు వృథా అవుతున్నాయి. ఈ విషయంపై రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను వివరణ కోరగా ఆ మందులు రిమ్స్ దవాఖానకు సంబంధించినవి కావని, సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కి సంబంధించినవని తెలిపారు. సెంట్రల్ డ్రగ్‌స్టోర్ అధికారికి ఫోన్ ద్వారా సంప్రదించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

విద్యార్థులు, అప్పటి క్లాస్‌మేట్‌తో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఆ బడిలోనే చదివి.. అక్కడికే తనిఖీకి వచ్చి..

40 ఏళ్ల బాల్య జ్ఞాపకాన్ని గుర్తు చేసుకొని ఉద్విగ్నతకు లోనైన అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఎదులాపురం, ఆగస్టు 23: ఆదిలాబాద్ ప్రభుత్వ బాలికల పాఠశాల తనిఖీకి వచ్చిన అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ఒక్కసారిగా ఉద్విగ్నతకు లోనయింది. కొద్ది సేపటి తర్వాత తాను కూడా 1984-85 సంవత్సరంలో పదవతరగతి ఇదే పాఠశాలలో చదివానని అక్కడున్న వారికి చెప్పి ఆశ్చర్యపరిచింది. అప్పటి పదో తరగతి గదిలో.. ప్రస్తుతం అదే పాఠశాలలో టీచర్ ప్రతిమతో కలిసి రెండో బెంచిలో కూర్చుండేవారమని గుర్తు చేసుకున్నది. ఆ బెంచిలో కొద్దిసేపు ప్రతిమతో కూర్చొని ఆనందించారు. అనంతరం పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం బాగుందని నిర్వాహకులను అభినందించారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని, మెరుగైన విద్యను అందించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎంత ఎదిగినా పాఠశాలను, క్లాస్‌మెట్లను మరిచిపోని అదనపు కలెక్టర్‌ను చూసి అక్కడి విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమేశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రతిమ, సులోచన, సారఖాతూన్ తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ లోడ్

ఆర్టీసీ బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణం

- టైర్లు పేలుతున్నా.. ఊడుతున్నా పట్టించుకునే వారేరీ?
- మరమ్మతులపై నిండా నిర్లక్ష్యం
- ప్రైవేటు బస్సు యాజమాన్యాలకే ప్రాధాన్యం
- ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా లేని బస్సులు
- ప్రశ్నార్థకంగా ఆర్టీసీ సంస్థ మనుగడ

ఓవర్‌లోడ్ కారణంగా ఇటీవల రాయికల్ వద్ద పేలిపోయిన బస్సు టైరు (ఫైల్)

నిర్మల్ ఆర్టీసీ బస్‌డిపో

బస్సులో ఎక్కేందుకు గుమిగూడిన ప్రయాణికులు

నిర్మల్, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ) : ప్రయాణికులే తమ దేవుళ్లనే ఆర్టీసీ నినాదంపై ప్రస్తుత ప్రభుత్వం శీతకన్ను ప్రదర్శిస్తున్నది. సంక్షోభంలో ఉన్న ఆర్టీసీ సంస్థను కాపాడేందుకు కేసీఆర్ ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకోవడమే కాకుండా, ఆ సంస్థకు పూర్వ వైభవం చేకూర్చింది. దీనికోసం అనేక సంస్కరణలను ప్రవేశపెట్టి వాటిని విజయవంతంగా అమలు చేసింది. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా గుర్తించి, వారికి అన్ని రకాలుగా ఆర్థిక ప్రయోజనాలు అందేలా కృషి చేసింది. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి నుంచి ఆర్టీసీని సంక్షోభం దిశగా నెట్టేసిందన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యం అంటూ వారిని అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోజురోజుకు ఆర్టీసీ ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వారి సంఖ్యకు అనుగుణంగా బస్సులను సమకూర్చకపోవడంపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. బస్సుల సంఖ్య తక్కువగా ఉండడం, ప్రయాణీకుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఒక్కో బస్సులో కెపాసిటీకి మూడింతలు ఎక్కువగా ప్రయాణీకులు.. కిక్కిరిసి తమ గమ్యాలకు చేర్చాల్సి వస్తున్నది. దీని కారణంగా బస్సులు ఓవర్‌లోడ్‌తో చెడిపోవడమే కాకుండా, కొన్నిసార్లు టైర్లు ఊడిపోతున్నాయి. అక్కడక్కడా టైర్లు పేలిపోయిన సంఘటనలు కూడా వెలుగులోకి వస్తున్నాయి.

ఓవర్‌లోడ్‌తో ప్రమాదాలు

నిర్మల్ డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు నిర్మల్ నుంచి జగిత్యాలకు వెళ్తుండగా రాయికల్ గ్రామం వద్దకు చేరుకోగానే బస్సు టైరు పెద్ద శబ్దంతో పేలిపోయింది. దీంతో బస్సులోని ప్రయాణీకులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. అలాగే నెల రోజుల క్రితం ఆదిలాబాద్ నుంచి నిర్మల్‌కు వస్తుండగా నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక టైర్లకు అనుసంధానంగా ఉన్న రాడ్డు విరిగిపోయింది. దీనికి కారణం ఓవర్‌లోడేనని నిర్ధారించారు. ఈ సంఘటనలు మరువక ముందే తాజాగా శనివారం నిర్మల్ డిపోకే చెందిన పల్లెవెలుగు బస్సు జగిత్యాల నుండి నిర్మల్‌కు తిరిగి వస్తుండగా మోరపెల్లి గ్రామం వద్ద బస్సు వెనుక టైర్లు ఊడిపోయాయి. వెంటనే డ్రైవర్ అప్రమత్తం కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ మూడు సంఘటనలు కూడా పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కడంతోనే జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అయితే ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ అధికారులు బస్సులను నడపకపోవడంతోనే ఓవర్‌లోడ్ కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయంటున్నారు. దీంతో ప్రయాణికులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తున్నది. ఒకప్పుడు ఆర్టీసీ అంటే భద్రతతో కూడిన ప్రయాణం అనేవారు. కానీ.. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పుడా నమ్మకం సన్నగిల్లుతున్నది. బస్సుల నిర్వహణలో ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంపై ప్రయాణికులు తీవ్రంగా మండిపడుతున్నారు.

అద్దె బస్సులకే అధిక ప్రాధాన్యత

ఆర్టీసీ మనుగడను కాపాడుతామంటూ ప్రకటనలు గుప్పిస్తున్న ప్రస్తుత ప్రభుత్వం క్రమంగా ప్రైవేటు(అద్దె) బస్సులకే ప్రాధాన్యతనిస్తుండడం సర్కారు చిత్తశుద్ధికి నిదర్శనంగా పేర్కొంటున్నారు. ప్రైవేటు బస్సుల ఇష్టారాజ్యం ప్రస్తుతం ఆర్టీసీలో యథేచ్ఛగా కొనసాగుతున్నది. జిల్లాలోని నిర్మల్, భైంసా ఆర్టీసీ డిపోల్లోని అధికారులు అద్దె బస్సులకే పెద్ద పీట వేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని రెండు డిపోల్లో మొత్తం 220 బస్సులను నడుపుతుండగా, వీటిలో అద్దె బస్సులు 124 ఉండగా, ఆర్టీసీ బస్సులు 96 మాత్రమే ఉన్నాయి. నిర్మల్ డిపోలో మొత్తం 143 బస్సులకు 77 అద్దె బస్సులు, 66 ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. భైంసా డిపోలో 77 బస్సులు ఉండగా, వీటిలో అద్దె బస్సులు 47, ఆర్టీసీ బస్సులు 30 ఉన్నాయి. అయితే గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే పల్లెవెలుగు బస్సులన్నీ ప్రైవేటు యాజమాన్యాలకే చెందినవి కావడంతో వాటి మరమ్మతులు, నిర్వహణపై ఆర్టీసీకి పట్టు ఉండడం లేదంటున్నారు. దీనికారణంగానే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా టైర్లు పేలిపోవడం, ఊడిపోవడం వంటి సంఘటనలు పునరావృతం కాకుండా బస్సుల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. కాగా.. శనివారం జరిగిన బస్సు టైర్లు ఊడిపోయిన ఘటనకు సంబంధించి నిర్మల్ డిపో మేనేజర్‌ను వివరణ కోరగా... సదరు బస్సు టైరు ఒకరోజు ముందు పంక్చర్ కావడంతో మరమ్మతు అనంతరం తిరిగి సరిగ్గా బిగించక పోవడం వల్లే ఊడిపోయినట్లు భావిస్తున్నామన్నారు.

నిర్మల్ డిపోకు చెందిన బస్సు టైర్లు ఊడిపోవడంతో జగిత్యాల జిల్లా మోరపెల్లి వద్ద నిలిచిన బస్సు

ప్రైవేట్ హాస్పిటళ్లపై కొరడా

- వైద్యశాఖ అధికారుల తనిఖీలు ముమ్మరం
- నిబంధనలు పాటించని దవాఖానల నిర్వాహకులకు నోటీసులు

ఆదిలాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో ప్రైవేట్ దవాఖానల్లో ప్రభుత్వ నిబంధనల అమలుపై వైద్యశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని రోజులుగా వ్యాధులు విజృంభిస్తుండడంతో ప్రజలు ప్రైవేట్ హాస్పిటళ్లను ఆశ్రయిస్తున్నారు. వివిధ ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర నుంచి వచ్చే వారితో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ దవాఖానలు కిటకిటలాడుతున్నాయి. ఇదే అదునుగా అవసరం లేకుండా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించడం, మందులు ఇవ్వడం, ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ వెంటనే స్పందించి ప్రైవేట్ హాస్పిటళ్లలో తనిఖీలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వైద్య శాఖ ప్రోగ్రాం అధికారులతో ప్రైవేట్ దవాఖానల్లో తనిఖీలు చేశారు. రెండ్రోజుల క్రితం కలెక్టర్ రాజర్షి షా అధికారులతో కలిసి ఆదిలాబాద్ పట్టణంలోని గజానన్ హాస్పిటల్‌ను తనిఖీ చేసి పలు లోపాలు గుర్తించి, వారం రోజుల్లో సరిచేసుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ నోటీసులు జారీ చేశారు.

ఆదిలాబాద్‌లో (రెండ్రోజుల క్రితం) గజానన్ హాస్పిటల్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా, వైద్యశాఖ అధికారులు

నిబంధనలు పాటించని ప్రైవేట్ దవాఖానలు

జిల్లాలోని పలు ప్రైవేట్ హాస్పిటళ్లలో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు వైద్య శాఖ ప్రోగ్రాం అధికారులు తనిఖీల్లో గుర్తించారు. జ్వరాలు, డెంగ్యూ కేసులు వివరాలు నమోదు చేయకపోవడం, ఓపీ, ఐసీయూ, వ్యాధి నిర్ధారణ పరీక్షల ధరల వివరాలను వెల్లడించకపోవడం, మందుల నిల్వల్లో తేడాలు, అగ్నిప్రమాద రక్షణ చర్యలు పాటించకపోవడం, వ్యాధుల నిపుణులు లేకున్నా ఉన్నట్లు చూపిస్తూ చికిత్స చేయడం లాంటి వాటిని గుర్తించారు. ఫీజుల వివరాలను పట్టికలో తెలియజేయకుండా ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయి. ఈ మేరకు ప్రైవేట్ దవాఖానల నిర్వాహకులు అధికారులు ఇటీవల సమావేశం నిర్వహించి ఏమైనా లోపాలు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. గజానన్ దవాఖానలో క్యాథ్‌లాబ్‌లో వైద్యులు లేకున్నా ఉన్నట్లు బోర్డు ఉండడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో నాలుగు దవాఖానలను తనిఖీలు చేసి పలు లోపాలను గుర్తించామని నిర్వాహకులకు నోటీసులు ఇవ్వనున్నట్లు జిల్లా వైద్యాధికారి కృష్ణ తెలిపారు.

రుణమాఫీ చేయాలి

- ప్రభుత్వ కార్యాలయాల ఎదుట రైతుల ధర్నా
- వ్యవసాయాధికారుల నిలదీత

కుంటాలలో తహసీల్ కార్యాలయం వద్ద రుణమాఫీ చేయాలని నినాదాలు చేస్తున్న రైతులు

కుంటాల, ఆగస్టు 23 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల పంట రుణాన్ని మాఫీ చేయాలని పెంచికల్‌పాడ్‌కు చెందిన రైతులు డిమాండ్ చేస్తూ శుక్రవారం కుంటాల మండల కేంద్రంలో తహసీల్ కార్యాలయం ఎదుట రోడ్డుపై ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ వినతి పత్రం అందించారు. అనంతరం వ్యవసాయ అధికారి కార్యాలయానికి వెళ్లి రుణమాఫీ అధికారులను నిలదీశారు. రేషన్ కార్డు, ఇతర సాంకేతిక కారణాలను సాకుగా చూపి సగం మంది రైతులకు రుణమాఫీ రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఎస్ఐ భాస్కరాచారి అక్కడికి వచ్చి బందోబస్తు నిర్వహించారు. ఈ నిరసనలో దిగంబర్ పటేల్, చంద్రకాంత్, గుద్దేటి కిష్టయ్య తదితరులున్నారు.

రుణమాఫీపై సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలి

కుభీర్, ఆగస్టు 23 : మండలంలోని పార్డి(బీ) గ్రామంలోని పలువురు అర్హత ఉండి రుణమాఫీ కాని రైతులు శుక్రవారం స్థానిక రైతువేదిక రోడ్డుపై ధర్నా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రుణమాఫీపై మంత్రుల మాటలకు పొంతన లేకుండా పోయిందని, ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేసి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడిస్తామని రైతులు హెచ్చరించారు. ఈ ఆందోళనలో మాజీ ఎంపీటీసీ బ్యారపు కానోబా, డాక్టర్ పోతన్న, బిజ్జం సంతోష్, శ్రీకాంత్, శ్రీనివాస్, ప్రవీణ్, శివలింగు, అనిల్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడిగా భాస్కర్

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 23: వ్యవసాయ శాఖ నిర్మల్ డివిజన్ సహాయ సంచాలకుడిగా వీ. భాస్కర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన వినయ్‌బాబు ముథోల్ ఏడీఏగా బదిలీపై వెళ్లడంతో వేములవాడలో పనిచేస్తున్న భాస్కర్‌ను ఇక్కడికి బదిలీపై వచ్చారు. నిర్మల్ ఏడీఏగా బాధ్యతలు స్వీకరించిన భాస్కర్‌ను అర్బన్ వ్యవసాయ శాఖ కార్యాలయం తరపున ఏవో నాగరాజు, ఏఈవో కుడాల రవికుమార్ శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

వ్యవసాయ సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించిన భాస్కర్

బాసరలో వైభవంగా సౌభాగ్యలక్ష్మీ వ్రతం

బాసర, ఆగస్టు 23 : శ్రావణమాసం మూడవ శుక్రవారాన్ని పురస్కరించుకొని బాసర అమ్మవారి క్షేత్రంలోని అక్షరాభ్యాస మండపంలో సామూహిక సౌభాగ్యలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ వైదిక బృందంతో పాటు భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

అమ్మవారికి వెండి వీణ బహూకరణ..

బాసర సరస్వతీ అమ్మవారికి లోకేశ్వరం మండలం గడ్‌చందా గ్రామానికి చెందిన దమ్మన్నగారి కవితా నాగేందర్ దంపతులు అమ్మవారికి సుమారు 500 గ్రాముల వెండితో చేసిన వీణను సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.

సౌభాగ్యలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు